# మాటలు కాదు

వరండాలోని పడక కుర్చీలో కూర్చుని చేతిలోని పుస్తకంమీద మనసు నిలిపే ప్రయత్నం చేస్తున్నాడు వేణుగోపాల్. కానీ ఏకాగ్రత కుదరడం లేదు.

రకరకాల ఆలోచనలు అల్లిబిల్లిగా కమ్ముకుంటున్నాయి. నిజానికి ఆయన ఏకాగ్రతని భగ్నం చేసే పరిస్థితులేవీ ఆ చుట్టుపక్కల లేవు.

ఇల్లంతా చాలా నిశ్శబ్దంగా వుంది. కొడుకూ, కోడలూ, మనవరాలు సుస్మితా ఉద్యోగానికి వెళ్ళారు. మనవడు కాలేజికి వెళ్ళాడు.

భార్య లోపలి గదిలో ఎక్కడో పూజ చేసుకుంటోంది. ఆవిడ చదువుతున్న లలితా సహస్రనామం మధ్యమధ్యలో లీలగా వినిపిస్తోంది. అంతే. అంతకు మించి మరే అలికిడీ లేదు.

కానీ ఆ నిశ్శబ్దంలో ప్రశాంతత లేదు. ఏదో అర్థంకాని శూన్యత వుంది. ఎడారిలో ఒంటరిగా నిలబడ్డ ఫీలింగ్.

ఆ దిగులుకీ, గుండె మూలల్లోని సన్నటి మంటకీ కారణమేమిటో తెలుసుకోవడం ఆయనకి చేతకావడం లేదు.

పూజ ముగించుకుని శకుంతల బయటికి వచ్చింది. "వంటయింది. అన్నం తినేస్తారా!" అంది.

వేణుగోపాల్ తలూపాడు. డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని అన్నం నోట్లో పెట్టుకుంటుంటే ఒక్క ముద్ద నోట్లోకి పంపించడం చాలా కష్టంగా తోచింది. ఇల్లంతా నిండిన శూన్యత ఊపిరాడనీయనట్లుగా అనిపించింది.

"రెండు రోజులలోకొచ్చింది పెళ్ళి" అంది శకుంతల తను కూడా మరో కంచంలో అన్నం వడ్డించుకుంటూ.

"ఎన్ని రోజులలోకొస్తే ఏమిటి?" అన్నాడు వేణుగోపాల్ విసుగ్గా.

పెళ్ళి మాట అనుకోగానే ఎందుకో ఆయన విసుగు మరీ ఎక్కువయింది.

పదిహేను రోజుల క్రితం ఇంట్లో మొట్టమొదటిసారి ఆ మాట వినబడినప్పుడు ఆయన చాలా సంబరంగా విన్నాడు.

కోడలు పెళ్ళికొడుకు వివరాలు చెప్పింది. "సుస్మిత చేసే ఆఫీసులోనే చేస్తాడు ఆ అబ్బాయి. ఇవాళ మా ఆఫీసుకి తీసుకు వచ్చింది. వెంటనే ఈయనకి ఫోన్ చేసి పిలిపించాను. మాక్కూడా అబ్బాయి బాగా నచ్చాడు. రేపు అతని తల్లిదండ్రులొచ్చి స్మితని చూస్తామన్నారు..."

వేణుగోపాల్ ఆ వివరాలన్నీ పట్టించుకోలేదు. పెళ్ళి అన్నమాట వింటూనే అతని మనసులో గొప్ప సందడి మొదలయింది.

"పెళ్లి... మనింట్లో పెళ్లి" అనుకున్నాడు సంబరంగా. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ ఆ సంబరం మెల్లమెల్లగా కరిగిపోసాగింది.

వాళ్లొచ్చి అమ్మాయిని చూశాకా, పెళ్ళి నిశ్చయమయ్యాక, ముహూర్తం నిర్ణయమయ్యాకా కూడా ఇంట్లో ఏమీ మార్పులు రాలేదు.

మార్పులు రాలేదా అంటే అసలేమీ రాలేదని కాదు... చీరలూ, నగలూ కొనడాలూ, శుభలేఖలు పోస్ట్ చేయడాలూ... ఇలా... ఏవేవో పనులూ... వాటిని గురించిన చర్చలూ... రోజూ వుంటున్నాయి. కానీ ఇంకేదో మిస్ అయినట్లూ... అసలైనదేదో లేనట్లూ అనిపిస్తోంది.

అదేమిటో వేణుగోపాల్‌కి అర్థం కావడం లేదు. "ఎక్కడుంది లోపం! తన లోనా! ఇంట్లోనా! తన చుట్టూ వున్న మనుషుల్లోనా! ఎక్కణ్నుంచి వస్తోంది తనకీ అసంతృప్తి?"

ఆయన అలా దీర్ఘాలోచనలో మునిగిపోవడం చూసి, "ఏమిటి, మళ్ళీ మీ బామ్మ గుర్తొచ్చిందా!" అంది శకుంతల.

వేణుగోపాల్ ఉలికిపాటుగా చూశాడు.

శకుంతల నవ్వుతూ "ఏమిటి! అంతేనా!" అంది.

తను కూడా చిన్నగా నవ్వేసి బయటకి వచ్చాడు వేణుగోపాల్. తన గదిలోకి వచ్చి మేను వాల్చగానే, శకుంతల గుర్తు చేసిన బామ్మా... ఆవిడని అల్లుకుని వున్న తన బాల్యమూ ఆలోచనలనాక్రమించాయి.

అవును. బాల్యమూ... బామ్మా... రెండు విడదీయలేని మాటలు... విడివిడిగా చూడటానికి సాధ్యం కాని మాటలు. చిన్నప్పుడు... రోజంతా... చేసే ప్రతిపనిలోనూ బామ్మ నీడ వుండేది.

నిద్ర లేవడమే ఆవిడతో గారాబం చేయించుకుంటూ లేచేవాడు. రోజంతా తగని సేవలు చేయించుకునేవాడు.

అయితే ఆ సేవలన్నీ ఒక ఎత్తు. రాత్రి పూట... వరండాలో కొబ్బరి చెట్టుకింద మంచం వాల్చి, తననీ, అక్కనీ చెరోపక్కనా పడుకోబెట్టుకొని ఆవిడ చెప్పిన కథలు ఒక ఎత్తు.

ఆవిడతో తనకి వున్న అసలైన అనుబంధం అదే. ఎన్నెన్ని కథలు! ఎన్నెన్ని కబుర్లు!

ఎలాగో పుట్టి, ఎలాగో పెరిగి, ఏదో చదువుకోవాలి కాబట్టి బడికి వచ్చే పిల్లాడి శక్తి వేరు. తన వెనక ఒక త్యాగరాజు, ఒక అన్నమయ్య, ఒక పొట్టిశ్రీరాములూ... మరో ప్రకాశం పంతులూ... వున్నారని తెలుసుకుని... ఆ తర్వాత స్కూల్‌కి వచ్చే పిల్లాడి శక్తి వేరు. ఆ శక్తి వేణుగోపాల్‌కి జీవితమంతా తోడుగా నిలిచింది.

ఆవిడ చెప్పిన కథలన్నిటిలోనూ అతనికి బాగా ఇష్టమైన కథ ఆవిడ పెళ్లి కథ. అయిదు రోజులపాటు జరిగిన ఆవిడ పెళ్లి... పల్లకీలో ఆవిడ కాపురానికి రావడం... ఆ కబుర్లు మళ్లీ మళ్లీ అడిగి చెప్పించుకునేవాడు వేణుగోపాల్.

బాగా చిన్నపిల్లలకే పెళ్లిళ్లు చేసే అలవాటున్న ఆ రోజుల్లో పెళ్లికొడుకునీ, పెళ్లికూతురునీ పల్లకీలో వూరేగించేవారనీ... రాత్రిపూట బయల్దేరి, అన్ని వీధులూ తిరిగి ఏ అర్ధరాత్రికో పల్లకీ ఇంటికి తిరిగి వచ్చేదనీ... ఈ లోపల పెళ్లికూతురు పల్లకీలోనే నిద్రపోయేదనీ... ఊర్లో ఆడవాళ్లూ, పిల్లలూ కూడా పూలపల్లకీ వస్తోందంటే నిద్రలు మానుకుని ఎదురు చూసేవారనీ... ఇవన్నీ చెప్తుంటే ఆసక్తిగా వినేవాడు వేణు.

అతని చిన్నతనంలో ఆ వూర్లో ఒక పెళ్లి జరిగింది. మిగతా విషయాలేవీ వేణుకి గుర్తు లేవు కానీ, పల్లకీ వూరేగింపు కోసం ఎదురుచూడటం మాత్రం గుర్తుంది. ఆ రోజు చాలా సేపు చూసి చూసి, నిద్రకి ఆగలేక "పల్లకీ వచ్చినప్పుడు లేపుతావుగా!" అంటూ ఆవిడ వొడిలోనే పడి నిద్రపోయాడు.

మెలకువ వచ్చేసరికి తెల్లగా తెల్లవారిపోయింది. ఇక ఒకటే ఏడుపు, నన్నెందుకు లేపలేదని.

"లేపాను కదురా! నువు చూశావు కూడాను, మన ఇంటి ముందునుంచే వెళ్లింది" అంటుంది ఆవిడ.

"ఏం లేపలేదు, పో. అన్నీ అబద్ధాలు చెప్తున్నావు" అంటాడు వేణు.

ఒక రోజంతా గొడవ పడ్డారు. వేణు చదువు పూర్తి చేసి ఉద్యోగంలో చేరేవరకూ అప్పుడప్పుడూ ఆ ప్రశ్న అడుగుతూనే వుండేవాడు.

"నిజం చెప్పు, ఆ రోజు నువు నన్ను నిద్ర లేపావా?" అని.

ఆవిడ ముసిముసిగా నవ్వుతూ "అది చిదంబర రహస్యం. నా ప్రాణం పోయేటప్పుడు... ఆఖరి క్షణంలో చెప్తాను" అనేది.

పెళ్లయిన కొత్తలో ఇదంతా శకుంతలతో చెప్పాడు వేణు. మొదట్లో ఆ విషయం గుర్తొచ్చి ఆలోచనలలోకి జారిపోవడం చాలా తరచుగా జరిగేది.

తరువాత్తరువాత రకరకాల వ్యాపకాల్లో, బాధ్యతలలో పడ్డాక ఆ ఆలోచన కొంత వెనక్కు వెళ్ళినా.. ఇప్పటికీ ఆ విషయం గుర్తొచ్చినప్పుడల్లా వేణుకి అదొక ఆరాటంగానే వుంటుంది. "నిజంగా బామ్మ నిద్ర లేపుంటుందా, లేదా ఆ రోజు!" అనుకుంటాడు వేళ్లతో కణతలమీద రాసుకుంటూ అసహనంగా.

అయిదేళ్ల క్రితం ఆవిడ చనిపోయింది. కానీ ఆ సస్పెన్స్ మాత్రం వేణుని వదిలిపెట్టలేదు.

వాకిట్లో ఆటో ఆగిన చప్పుడవడంతో కిటికీలోనుంచి బయటికి చూశాడు వేణుగోపాల్.

ఆటో దిగి లోపలికి వస్తున్న అనసూయా, నవ్వు మొహంతో ఎదురెళ్తూ "రండి వదినగారూ!!" అంటున్న శకుంతలా కనిపించారు.

వేణు కూడా బయటికి నడిచి అక్కగారి చేతిలోని సూట్‌కేస్ అందుకున్నాడు. అనసూయ స్నానం, భోజనం అయ్యి కూర్చోగానే ముగ్గురూ కబుర్లలో పడ్డారు.

ఇంటివైపు పరికించి చూస్తూ... "సున్నాలు వేయించలేదా!" అంది అనసూయ.

"ఆఁ.. సున్నాలు వేయడం అంటే ఇపుడు బోలెడంత పని... అన్నీ సర్దుకోవడం కష్టం... అంది కోడలు. నాకూ ఓపిక లేదు. అందుకే వూరుకున్నాం" శకుంతల జవాబు చెప్పింది.

"నేనే మొదటి చుట్టాన్నన్నమాట. రేపే కదా పెళ్ళి కూతుర్ని చేసేది... ఈ పాటికి ఇల్లంతా సందడిగా వుంటుందనుకున్నాను" అంది అనసూయ నవ్వుతూ.

వేణుగోపాల్‌కి తన అసంతృప్తంతా మళ్లీ ఒక్కసారిగా కమ్ముకున్నట్లయింది.

శకుంతల నవ్వింది. "ముందుగా రావడానికి వాళ్ళకీ తీరిక లేదు... వస్తే చేయడానికి వీళ్లకీ తీరిక లేదు. అందరూ రేపు తెల్లవారేసరికి వస్తారు" అంటూ వంటగదిలోకి నడిచింది.

వేణుగోపాల్ గొంతు సవరించుకుని అనసూయ వైపు చూశాడు. ఏదో చెప్పాలనుకుంటున్నట్లుగా కనిపిస్తున్న తమ్ముడ్ని చూసి "ఏంటిరా!" అంది అనసూయ. అతనిలోని అసహనాన్ని ఆమె అప్పటికే గమనించింది.

ఒక రెండు మాటలు తడబడుతూ వచ్చాయి వేణు నోట్లోనుంచి. ఆ తర్వాత ప్రవాహంలా దూకాయి. తన బాధంతా వినిపించి "ఏంటో అక్కా! అసలిది పెళ్ళిలాగానే అనిపించడం లేదు నాకు" అన్నాడు.

"బాగుంది. ఇదివరకు లాగా ఇప్పుడు జరగాలంటే ఎలా కుదురుతుందిరా! రోజులు మారలేదూ! అప్పటి పరిస్థితులు వేరు. ఇప్పటి పరిస్థితులు వేరు" అంది అనసూయ.

"ఏంటి మీ అసంతృప్తి! ఇంటికి సున్నాలూ... ఇంటి ముందు పందిళ్ళూ వేయకపోవడమా! నాల్రోజుల ముందే చుట్టాలు రాకపోవడమా!" కాఫీ తీసుకు వస్తూ శకుంతల పరిహాసంగా అడిగింది.

వేణుగోపాల్ ఆ పరిహాసానికి ప్రతిస్పందించలేదు. గంభీరంగా చూస్తూ... "ఆ రెండూ కాదు.. ఇంకేంటో! నాకే తెలీడం లేదు" అన్నాడు.

"పల్లకీ వూరేగింపు లేదనా!" శకుంతల మరింత పరిహాసంగా నవ్వుతూ అడిగింది. "పెళ్ళంటే చాలు ఈయనకి మీ బామ్మగారూ, ఆవిడ పల్లకీ వూరేగింపు చూపించకపోవడమూ గుర్తొస్తాయి వదినగారూ!" అంది అనసూయ వైపు తిరుగుతూ కంప్లైంట్ చేస్తున్నట్లుగా.

అంతలోనే మళ్ళీ తనే జాలిగా చూసింది. "పాపం ఈయన సస్పెన్స్ తీర్చకుండానే పోయారావిడ! ఈయనకేమో ఆ విషయం తెలిస్తే కానీ అశాంతి పోయేలా లేదు" అంది.

బిడియంగా తల వంచుకున్నాడు వేణు.

"అదా!" అనసూయ కూడా నవ్వింది. "నేను చెప్పనా!" అంది తమ్ముడివైపే పరీక్షగా చూస్తూ.

"నీకు తెలుసా!" అని వేణూ, "మీకు తెలుసా!" అని శకుంతలా ఒకేసారి అరిచారు.

అనసూయ తలవూపింది. "నా పెళ్లయిన కొత్తలో బామ్మ చెప్పింది" అంది.

"మరి నాకెందుకు చెప్పలేదు!" ఉక్రోషంగా అడిగాడు వేణుగోపాల్.

అనసూయ మళ్ళీ నవ్వింది. "ఇదిగో... ఈ చిన్నపిల్లాడి మనస్తత్వం పోలేదనే!" అంది. ఆ తర్వాత గంభీరంగా చూస్తూ చెప్పింది.

"పిల్లలందరూ మాటలు నేర్చుకుంటార్రా వేణూ! కానీ కొంతమంది పిల్లలకి మాత్రమే ఆ మాటల వెనుక వున్న మధురమయిన భావాన్ని పెద్దవాళ్ళ దగ్గరనుంచి నేర్చుకునే అదృష్టం వుంటుంది.

"తెలుపు... ఎరుపు... వూదా... నీలం... కోకిల .... హంస.... సింహం.. ఆవు... పదాలు... రకరకాల పదాలు. లెక్కలేనన్ని పదాలు.

పెరిగే ప్రతి పిల్లవాడికీ ఈ పదాలన్నీ తెలుస్తాయి. అనుబంధాలు అర్థమవుతాయి. కానీ ఆ అర్థమయ్యే తీరులోనే బోలెడంత వ్యత్యాసం వుంది. కొంతమందికి అన్నాచెల్లెళ్ల అనుబంధం సినిమాలో చూపించే అసహజపు కౌగిలింత అయితే.. మరికొంతమందికి అది... ద్రౌపదీ మానసంరక్షణ కోసం పరుగెత్తుకువచ్చిన కృష్ణుడి ఆరాటం...

బంధం ఒకటే... భావంలోనే తేడా. మాట ఒక్కటే, కానీ దానిని సరియైన అనుభూతిగా మనసులో నిలపగలగడం... అదీ... అందులో వుంటుంది ప్రతిభ.

"బామ్మ మనకు మాటలు నేర్పింది. తెలుగువాచకం పక్కన పెట్టుకుని పదాలు నేర్పింది.

లోకంలో అనాకారులయిన అమ్మలు ఎందరో వుండవచ్చు. కానీ పుస్తకంలో ఆ మాట పక్కన అందమైన బొమ్మే వేస్తాడు చిత్రకారుడు. ఆవిడా అంతే.

"పెళ్లి అనే మాటని మనకి పరిచయం చేసేటప్పుడు అందంగా చెప్పాలనుకుంది. అందుకే ఆవిడ రోజుల నాటి పెళ్లిని వర్ణించింది. దానినే మనసులో నిలుపుకున్న నువ్వు వూర్లో ఎక్కడో పెళ్ళి జరుగుతోందనగానే 'పల్లకీ వస్తుందా బామ్మా!' అని అడిగావు.

అప్పటికే పల్లకీ వూరేగింపులు తగ్గిపోయాయి. కానీ ఆ మాట చెప్పి నిన్ను అయోమయంలో పడేయడం ఆవిడకి ఇష్టం లేకపోయింది.

"అయితే దురదృష్టవశాత్తూ ఆ రోజు వూరేగింపు జరిగింది. పెళ్లి వూరేగింపు కాదు. చావు వూరేగింపు. ఏవో గొడవల వల్ల పెళ్లి ఆగిపోయి ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందట. శవం మన ఇంటి ముందునుంచే వెళ్లిందట" ఒక్కక్షణం ఆగి గట్టిగా వూపిరి తీసుకుంది అనసూయ.

"వేణూ! చాలామంది జీవితాలలో మంగళవాద్యాలకీ... చావు మేళానికీ తేడా వుండకపోవచ్చు. కొందరి హృదయాలలో మొదటిది వేదననీ, రెండోది ఆనందాన్నీ నింపవచ్చు. కానీ వాస్తవంగా అవి రెండు వేరు వేరు మాటలు. విభిన్నమయిన భావాలు. పసిపిల్లలకి అవి అలాగే అర్థం కావాలి. నవ్వూ... ఏడుపూ.. ఎండా.. వానా... తెలుపూ... నలుపూ... ప్రతిమాటకీ హృదయం ప్రత్యేకంగా స్పందించాలి.

వ్యతిరేక పదాలని నీ నోరు వల్లె వేసినట్లే నీ మనసు కూడా వల్లె వేయాలని బామ్మ కోరుకుంది. అందుకే ఆ రోజు అబద్ధం చెప్పింది.

అనసూయ మాటలు పూర్తి చేసేసరికి, గదిలో చిరుచీకట్లు కమ్ముకుంటున్నాయి. శకుంతల లేచి లైట్లు వేసింది.

ఆడవాళ్ళిద్దరూ బయటకి వెళ్ళినా వేణు గదిలో అలాగే నిశ్చలంగా కూర్చుండిపోయాడు. అతనికేదో కొత్త జన్మ ఎత్తినట్లుగా వుంది.

పుట్టినప్పటినుంచీ తెలిసిన, తన జీవితంలో పెనవేసుకుపోయిందనుకుంటున్న బామ్మ.. ఈ రోజే మళ్ళీ కొత్తగా పరిచయమైనట్లుగా వుంది. ఆమె వ్యక్తిత్వం కొత్తగా కళ్ళముందు మెరుస్తోంది. "అంత మంచి గురువుని తను సరిగ్గా ఉపయోగించుకోలేకపోయాడా!"

వేణు ఆలోచనల్లో మునిగి వుండగానే కొడుకూ, కోడలూ, మనవలూ వచ్చిన అలికిడి అయింది.

అందరూ అనసూయని పలకరించడం... ఒకపక్క వంట ప్రయత్నాలు చేస్తూ, మరోపక్క పెళ్ళి కబుర్లు చెప్పుకోవడం... అన్నీ లీలగా వినిపించసాగాయి.

శకుంతల వచ్చి భోజనానికి పిలిచేదాకా గదిలోనే కూర్చున్నాడు వేణు. భోజనం చేస్తూ "అక్కయ్య ఏదీ!" అన్నాడు.

"స్మితని తీసుకుని బయటికి వెళ్ళారు. ఏవో పెయింట్లూ అవీ తెచ్చుకుంటారట" అంది శకుంతల.

వేణుకి అర్థం కాలేదు. కానీ రెట్టించి అడగలేదు. భోజనం చేసొచ్చి పడుకున్నాడు.

"అక్క అర్థం చేసుకున్నంత బాగా బామ్మని తానెందుకు అర్థం చేసుకోలేక పోయాడు! ఆవిడ అందించిన జీవితసారాన్ని అక్క అందుకున్నంత బాగా తానెందుకు అందుకోలేకపోయాడు!" ఆలోచిస్తూనే నిద్రలోకి జారాడు.

అర్థరాత్రి దాటుతూండగా హఠాత్తుగా మెలకువ వచ్చింది. హాల్లోనుంచి ఆడవాళ్ళ మాటలూ, నవ్వులూ వినపడుతున్నాయి. మెల్లగా లేచి ఇవతలికి వచ్చాడు వేణు.

అక్కడ కనబడిన దృశ్యం అతన్ని అప్రతిభుడిని చేసింది. హాలు మధ్యలో వున్న ముగ్గుకి చెరోవైపునా కూర్చుని వున్నారు సుస్మితా, అనసూయ.

మరో పక్కన శకుంతలా, కోడలూ పెళ్ళి సామాన్లేవో పెట్టెలో సర్దుతున్నారు. స్మిత పెయింట్ డబ్బా ఓపెన్ చేసి అందులో బ్రష్ ముంచుతోంది. అనసూయ మరో బ్రష్ అందుకుంటుంటే...

"వేయగలవా అమ్మమ్మా! ఆకులూ, పూవులూ క్లియర్‌గా కనబడుతున్నాయా" అంది స్మిత స్నేహితురాలితో మాట్లాడినంత పరిహాసంగా.

"నాకు ఆకులూ, పూవులూ అంత బాగా కనపడడం లేదు. నిజమే కానీ..." అనసూయ నిట్టూరుస్తున్నట్లుగా అంది. "నీ కసలు ముగ్గు కనిపిస్తోందా! అని..."

శకుంతలా, కోడలూ ఫక్కున నవ్వారు.

స్మిత సిగ్గుపడుతున్నట్లుగా తలదించుకుంది.

మనవరాలి కళ్ళల్లోనూ, మొహంలోనూ తాను అంతవరకూ చూడని పరవశాన్నీ... ఓ కొత్త మైమరుపునీ మొదటిసారిగా చూసిన వేణుగోపాల్ మనసు సంతృప్తితో నిండిపోయింది. ఇన్నాళ్లూ తాను మిస్ అవుతున్నదేమిటో ఆయనకి అర్థమయింది.

ఇంట్లోకి ఒక్కసారిగా పెళ్ళికళ వరదలై వచ్చినట్లు తోచింది.

<u>రచనాకాలం : 2001</u>